ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 17.06.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఆగస్టు 15 లోగా రైతులకు 2 లక్షల రూపాయల వరకు పంట రుణాలను మాఫీ అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం విధి విధానాలను రూపొందిస్తోంది.

2. ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద 17వ విడత నిధులను రేపు విడుదల చేస్తారు.

3. త్యాగ నిరతిని చాటి చెప్పే బక్రీద్ పర్వదినాన్ని ఈరోజు ముస్లీంలు భక్తి, శ్రద్దలతో జరుపుకుంటున్నారు.

4. ఉపరితల ద్రోణి ప్రభావం వల్ల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

-------------

రుణమాఫీ

ఆగస్టు 15 లోగా రైతులకు 2 లక్షల రూపాయల వరకు పంట రుణాలను మాఫీ అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం విధి విధానాలను రూపొందిస్తోంది. అర్హులైన వారికి మాత్రమే రుణమాఫీ అందించేందుకు అధికారులు వివిధ ప్రతిపాదనలు పరిశీలిస్తున్నారు. పాస్ బుక్ లను, రేషన్ కార్డులను రుణ మాఫీ అమలుకు ప్రామాణికంగా తీసుకోవాలని భావిస్తున్నారు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఆదాయం పన్ను చెల్లించే వారు, ఉద్యోగులను రుణమాఫీ నుంచి మినహాయించాలని ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. 2018 డిసెంబర్ 12 నుంచి తీసుకున్న పంట రుణాలు, రెన్యువల్ అయిన వాటికి మాఫీ అమలు చేసే అవకాశం ఉంది.

డెస్క్

-----------

కిసాన్

ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద 17వ విడత నిధులను రేపు విడుదల చేస్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారణాశి నుంచి ఈ నిధుల విడుదల ప్రారంభిస్తారు. 9 కోట్ల 26 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో దాదాపు 20 వేల కోట్ల రూపాయల నిధులను నేరుగా జమ చేస్తారు.  ఈ పథకం కింద ఏటా 6 వేల రూపాయలను 3 విడతలుగా 2 వేల రూపాయల చొప్పున రైతులకు పెట్టుబడి సహాయంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది.

ఎన్.ఎస్.డి

-----------

లీడ్ బక్రీద్

త్యాగానికి ప్రతీక అయిన – బక్రీద్ ను ముస్లింలు ఈరోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈద్గాల్లో, మసీదుల్లో ఉదయం నుంచే బక్రీద్ ప్రత్యేక ప్రార్ధనలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, మసీదులకు ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బక్రీద్ ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ లోని మీరాలమ్ ఈద్గా వద్ద భారీ సంఖ్యలో ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహిస్తున్నారు. మక్కా మసీద్ లో కూడా ముస్లింలు సామూహిక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాల పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గవర్నర్ రాధా కృష్ణన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు బక్రీద్ శుభాకంక్షలు తెలిపారు.

డెస్క్

-----------

బక్రీద్ – జిల్లాలు

నల్గొండ లోని మునుగోడు రోడ్ లో ఉన్న ఈద్గాలో జరిగిన బక్రీద్ ప్రార్ధనల్లో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు, నల్గొండ పట్టణంలో గత 30 ఏళ్లుగా హిందువులు, ముస్లింలు సామరస్యంతో జీవిస్తున్నారని, ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలని మంత్రి కోరారు.

ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, బోథ్, ఇచ్చోడ, జైనథ్, బేల, నేరడిగొండ, తలమడుగు, తాంసి, గుడిహత్నూర్ ప్రాంతాల్లో ఈద్గాల వద్ద ముస్లింలు భక్తి, శ్రద్దలతో బక్రీద్ ప్రార్థనలు చేశారు. ఆదిలాబాద్ లో ఈద్గా వద్ద పేదలకు దాన, ధర్మాలు చేశారు.

మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల, లక్షెట్టిపేట, చెన్నూర్, మందమర్రి పట్టణాల్లో ఈద్గాల వద్ద బక్రీద్ ప్రార్ధనలు నిర్వహించారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లేల చిన్నారెడ్డి మక్కా మసీద్ వద్ద ముస్లింలను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు కాంగ్రెస్, మైనారిటి విభాగం నాయకులు పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని లోని 5వ ఇంక్లైన్ వద్ద ఉన్న ఈద్గాలో ముస్లింలు బక్రీద్ ప్రార్ధనలు చేశారు. రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

పిటిసి, నల్గొండ/ఆదిలాబాద్/మంచిర్యాల/వనపర్తి/కరీంనగర్

-----------

**మెదక్ బంద్**

గోవుల రవాణ, కోనుగోలుకు సంబంధించి ఇరు వర్గాల మధ్య ఘర్షణలు జరిగిన మెదక్ లో పరిస్థితి అదుపులో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. పట్టణంలో నిన్న చేపట్టిన బంద్ ను నేడు కూడా కొనసాగుతోంది. కాగా, అరెస్ట్ చేసిన గో రక్షణ

నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపైఎం నేతలు బైక్ ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తున్నారు.

పిటిసి, మెదక్

-----------

సైరుతి

సైరుతి రుతు పవనాలు ఈ ఏడాది ముందుగానే ప్రవేశించినప్పటికి తెలంగాణలోని పలు జిల్లాల్లో ఇంకా లోటు వర్షపాతమే నమోదైంది. 14 జిల్లాల్లో తగినంతగా వర్షాలు కురవలేదు. అయితే ఈనెల చివరి నాటకి రుతు పవనాలు తెలంగాణపై ప్రభావం చూపే అవకాశం ఉందని జులై నెలలో భారీ వర్షపాతం నమోదు కావచ్చని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇలా ఉండగా, ఉపరితల ద్రోణి ప్రభావం వల్ల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న మూడు రోజుల పాటు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

డెస్క్

-----------

చంద్రబాబు నాయుడు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించే ఆనవాయితీకి అనుగుణంగా చంద్రబాబు నాయుడు ఇప్పుడు తిరిగి ముఖ్యమంత్రి అయిన తర్వాత నేడు తొలిసారి పోలవరం ప్రాజెక్ట్

సందర్శించారు. హెలికాప్టర్ నుంచి ఆయన ప్రాజెక్టును పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

డెస్క్

-----------

గ్రూప్ 4

గ్రూప్ 4 అభ్యర్థుల సర్టిఫికేట్ల వెరికేషన్ తేదీలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ప్రకటించింది. షార్ట్ లిస్ట్ అయిన వారికి ఈనెల 20 నుంచి ఆగస్టు 21 వరకు రెండు నెలల పాటు వెరిఫికేషన్ నిర్వహిస్తారు. ఎవరైనా హాజరు కాకాపోతే ఆగస్టు 24, 27, 31 తేదిలలో పరిశీలిస్తామని పబ్లిక్ సర్వీస్ కమీషన్ తెలిపింది. ఇలా ఉండగా, ఉస్మానియా విశ్వ విద్యాలయంతో పాటు రాష్ట్రంలోని పలు విశ్వ విద్యాలయాలలో ప్రవేశాలకు నిర్వహించే CPGET-2024 దరఖాస్తుల గడువు ఈరోజుతో ముగుస్తుంది. అయితే 5 వందల రూపాయల ఫైన్ తో ఈనెల 25, 2 వేల రూపాయల ఫైన్ తో ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై 6 నుంచి 15 వరకు పరీక్షలు జరుగుతాయి.

డెస్క్

-----------

పాఠశాల బస్సులు

పాఠశాల బస్సుల నిర్వహణలో నిబంధనలు పాటించాలని రాజన్న సిరిసిల్లా జిల్లా రవాణాధికారి లక్ష్మణ్ సూచించారు. ఫిట్ నెస్ లేకుండా స్కూల్ బస్సులు రోడ్డుపైకి

వస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఫిట్ నెస్ తో పాటు కాలుష్య రహిత సర్టిఫికేట్, ఇతర ధృవీకరణ పత్రాలు పొందాలని డ్రైవర్లకు సూచించారు.

పిటిసి, సిరిసిల్లా

-----------

సెంట్రల్ ఎంప్లాయిస్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. సిబ్బంది తరచు ఆలస్యంగా వస్తూ పని వేళలు పూర్తి కాక ముందే వెళ్లి పోతున్నట్లు గుర్తించామని, ఇకపై ఇలాంటి వైఖరిని సహించేది లేదని స్పష్టం చేశారు. ఇకపై ఎవరైనా ఆలస్యంగా వచ్చినా, ముందుగా వెళ్లిపోయినా అర పూట జీతం కోత లేదా ఆర్జిత సెలవుల నుంచి తగ్గింపు ఉంటుందని అధికారులు హెచ్చరించారు. నెలలో 2 రోజులు మాత్రం గంటకు మించకుండా ఆలస్యానికి అనుమతి ఇస్తామని తెలిపారు.

డెస్క్

-----------

నీట్ పేపర్

నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజి వార్తలను కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఖండించారు. ఈ పరీక్ష పూర్తి పారదర్శకంగా జరిగిందని స్పష్టం చేశారు, కేవలం రెండు పరీక్షా కేంద్రాల్లో మాత్రమే అక్రమాలు జరిగినట్లు గుర్తించామని, ఇందులో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఉన్నతాధికారుల ప్రమేయం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు

తీసుకుంటామని ధర్మేంద్ర ప్రదాన్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 1,563 మంది అభ్యర్థులకు మళ్లీ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

ఎస్.ఎస్.డి

-----------

రైలు ప్రమాదం

పశ్చిమ బెంగాల్ లోని డార్జిలింగ్ లో జరిగిన రైలు ప్రమాదంలో 15 మంది మరణించగా, మరో 60 మంది గాయపడ్డారు. న్యూజల్ పాయ్ గూడి సమీపంలోని కాంచన్ జంగా ఎక్స్ ప్రెస్ ను వెనక నుంచి ఒక గూడ్స్ రైలు ఢీ కొట్టడంతో ఈ రైలు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గూడ్స్ రైలు బోగీలు చెల్లాచెదురు కాగా, ఎక్స్ ప్రెస్ రైలు కు చెందిన రెండు బోగీలు పట్టాలు తప్పాయి.

రాష్ట్రపతి, ప్రధానమంత్రి ఈ ప్రమాదం పట్ల దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రమాద స్థలానికి బయలుదేరి వెళ్లారు. సహాయ చర్యలు కొనసాగుతున్నాయి.

ఎస్.ఎస్.డి

-----------

న్యాయ చట్టాలు

కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త న్యాయ చట్టాలు దేశంలో క్రిమినల్ న్యాయవ్యవస్థకు అత్యంత కీలకమని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘు వాల్ తెలిపారు. భారతీయ న్యాయ సహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య పేరుతో తీసుకువచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు జూలై 1వ తేది

నుంచి అమలులోకి వస్తాయని కేంద్ర మంత్రి కోల్ కతా లో చెప్పారు. భారతీయ న్యాయ సంహితలో కొత్తగా 20 నేరాలను చేర్చినట్లు ఆయన తెలిపారు.

ఎన్.ఎస్.డి

-----------

యాడ్ బక్రీద్

రాజన్న సిరిసిల్లా జిల్లాలోని సిరిసిల్లా, వేములవాడ ఈద్గాలలో బక్రీద్ ప్రార్ధనలకు ముస్లీంలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

జనగామ జిల్లాలో ముస్లీంలు బక్రీద్ ను ఘనంగా జరుపుకున్నారు. జిల్లా ప్రజలు మత సామరస్యంతో జీవించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆకాంక్షించారు.

సంగారెడ్డి జిల్లా సవాశివపేటలో జరిగిన బక్రీద్ ప్రర్ధనా కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. మెదక్ జిల్లాలోని ఈద్గాలలో ముస్లీంలు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

పిటిసి, రాజన్న సిరిసిల్లా/జనగాం/సంగారెడ్డి/మెదక్

-----------

విద్యుత్

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రామగుండంలో తెలంగాణ కోసం ప్రత్యేకంగా NTPC నిర్మించే 2 వేల 4 వందల మెగావాట్ల విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ కావాలో వద్దో జులై నెలాఖరు లోగా తేల్చి చెప్పాలని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాష్ట్ర విద్యుత్ శాఖకు సూచించారు. విభజన చట్టం

ప్రకారం 4 వేల మెగా వాట్ల ప్లాంట్ ను తెలంగాణ కోసం ప్రత్యేకంగా నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికే 16 వందల మెగా వాట్ల ప్లాంట్ ను తెలంగాణ విద్యుత్ కేంద్రం పేరుతో రామగుండంలో NTPC నిర్మించింది. దీన్నించి రోజుకు 3 కోట్ల యూనిట్ల కరెంట్ ను తెలంగాణ సరఫరా చేస్తుంది. మిగిలిన 2 వేల 4 వందల మెగావాట్ల ప్లాంట్ ను నిర్మించనున్నామని, దీన్నించి విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకుంటారో లేదో స్పష్టం చేయాలని కేంద్ర మంత్రి తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

డెస్క్

-----------

రైల్వే లైన్

ఆంధ్రప్రదేశ్ లో గూడూరు – రేణిగుంట మధ్య 3వ రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ప్రధానమంత్రి జాతీయ మాస్టర్ ప్లాన్ లో భాగంగా ఈ రైలు మార్గాన్ని నిర్మాస్తారు. ఈ రెండు స్టేషన్ల మధ్య 83 కిలో మీటర్లకు పైగా రైలు మార్గం నిర్మాణానికి 884 కోట్ల రూపాయలు ఖర్చవుతాయని అంచనా వేశారు. ఈ మార్గంలో 2 రైల్వే వంతెనలు, అండ్ పాస్ లు నిర్మించాల్సి ఉంటుంది. కాగా, ఈ ప్రాజెక్ట్ కోసం 36.58 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది.

డెస్క్

-----------

సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం వ్యవసాయానికి విత్తనాలు, ఎరువుల కొరత లేదని జిల్లా వ్యవసాయ శాఖాధికారి భాస్కర్ తెలిపారు. వరి, పత్తి, ఇతర పంటల విత్తనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే దుకాణాల డీలర్లపైనా, నకిలీ విత్తనాలను విక్రయించే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పిటిసి, సిరిసిల్లా

-----------